## క్లుప్తంగా

### పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్‌రాజు

నింద్ర: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం వండి పెట్టాలని ఎంఈఓ శ్రీధర్ రాజు అన్నారు. శనివారం ఆయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు. అనంతరం వివిధ రకాల వంటల తయారీలో భాగంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన నైమా, ఎంఈఓ వసుమతి, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### సబ్సిడీపై జనుము, జీలుగ పంపిణీ

నింద్ర: మండలంలోని రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై రైతులకు జనుము, జీలుగ పంపిణీ చేస్తున్నామని, కావల్సిన రైతులు ఆర్బీకేలలో తీసుకోవచ్చన్నారు.

### పకడ్బందీగా కౌంటింగ్



మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓలు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలోనే పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్స్ తెరవడం జరుగుతుందన్నారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఈనెల 4న నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. సంబంధిత ఏజెంట్ల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్‌బ్యాలెట్‌ల లెక్కింపులో 13సీ, 13 బీ ని ఏఆర్‌ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఏవైన సమస్యలున్నట్లయితే వెంటనే ఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టి ప్రతిటేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 3న ఉదయం 11 గంటలకు ఎన్వీ సెట్ కౌంటింగ్ సెంటర్‌లో విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించేది లేదని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ కౌంటర్ నందు ఫోన్‌ను డిపాజిట్ చేయాలన్నారు. విధులలో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, పలు నియోజకవర్గాల ఆర్‌ఓలు చిన్నయ్య, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు మురళికృష్ణ, శ్రీదేవి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# రైతులకు సుస్థిర సాయం

- పొలాల్లోనే జీవామృతం తయారీ తొట్టెలు నిర్మించుకుంటున్న రైతులు
- పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు
- ఒక్క నగరి మండలంలోనే 250 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు
- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గోపతి వాసు



కృష్ణారామపురంలో జీవామృతం సిద్ధం చేస్తున్న రైతు

నగరి: మండలంలోని రైతులు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు, పురుగుల మందులకు బదులుగా ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలను వాడి సాగుచేయడానికి సిద్ధమవుతున్నారు. వేలల్లో ఖర్చయ్యే ఎరువులకు, పురుగుల మందుల వాడకానికి స్వస్తి పలికి సొంతంగా కషాయాలను తయారు చేసుకుంటున్నారు. పంచకావ్య, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుము లాంటివి వాడి సాగుచేసే పంటలనే ప్రజలకు ఆరోగ్యాన్ని ఇస్తుందన్న ఆలోచన రైతులకు కలుగుతోంది. దీంతో మెలమెల్లగా సేంద్రియం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. నగరి మండలంలోనే 250 ఎకరాల మేర సేంద్రియ సాగు జరుగుతోంది. ఈ పద్ధతులను అవలంభించడం ద్వారా భూసారం కోల్పోవడం జరగదని, దిగుబడి ఎక్కువగా వస్తుందని, భూముల్లో భూసారం పెంచే వానపాములు తయారవుతాయని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటల్లో వ్యత్యాసం ఉంటుందని రసాయనాలు వాడే పంటకన్నా ఈ పద్ధతిలో పండించే పంట ఆరోగ్యకరం అంటున్నారు. నగరి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ చెరుకు, పూలతోటలు మల్బరీ, కూరగాయల పంట అంటూ నగరి డివిజన్ పరిధిలో 650 ఎకరాల్లో సేంద్రియసాగు జరుగుతోంది.

**శాశ్వత ప్రాతిపదికన జీవామృతం తొట్టెలు..**

ఘనజీవామృతాన్ని పిడకల రూపంలో తయారు చేసి నిల్వ ఉంచుకునే రైతులు ద్రవజీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెల్లో క్యాన్లలో ఉంచుకుంటారు. అయితే ఈ ప్లాస్టిక్ క్యాన్లు చోరీలకు గురికావడంతో కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. పొలానికి నీరు పారించే కాలువల పక్కనే సిమెంటు ఒరలతో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మించుకుంటున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటు చేసి నీరు పారే కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడం వల్ల నీటితో కలిసి ద్రవజీవామృతం సమంగా పొలానికి పారుతూ సత్ఫలితాలు ఇస్తుండడంతో నగరి డివిజన్ పరిధిలోని మండలాల్లోనే 60 మంది రైతులు తమ పొలాల్లో శాశ్వత ద్రవజీవామృత తొట్టెలను నిర్మించుకుని రాష్ట్రంలోని రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



నగరి: వేలావడిలో జీవామృతం కలుపుతున్న రైతు



నింద్ర: అగరం వద్ద జీవామృతం తొట్టి నిర్మించుకుంటున్న రైతు

**ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం..**



ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడి రావడంతో పాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుంది. సేంద్రియ ఎరువుల తయారీలో సందేహాలు ఉంటే 9502398214 నంబరులో సంప్రదిస్తే వారికి అవగాహన కల్పిస్తాం. వాడే విధానాన్ని రైతులకు సూచిస్తాం. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులైన సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలవైపు రైతులను తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

### చెవుటి గంగమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో చెవుటి గంగమ్మ

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ తల్లికి శనివారం పాలాభిషేకం, అంబలి పోయడానికి కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి ఎదుట కలశాలు పెట్టి గణపతి హోతం, నవగ్రహ హోమం, శాంతిహోమం చేశారు. హోమంలో ఉంచిన కలశ నీటితో అమ్మవారిని అభిషేకించారు. 10 గంటలకు ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో నయ్యాడి వాయిద్యాలతో అమ్మవారి దేవస్థానాన్ని ప్రత్యక్షంగా ఆలయ ఆవరణలో ఉంచారు. అర్చకులు ఆలయానికి భక్తులు తెచ్చిన అర్చకులు తీసుకొచ్చిన పాలు, పసుపు నీటితో వివిధ అభిషేకాలు చేశారు. అమ్మవారిని అభిషేకించడానికి మహిళలు పాలు, పసుపు నీటిని తీసుకురావడంతో కిటకిటలాడారు. అభిషేకాలు పూర్తయిన తర్వాత అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ధర్మకర్త అంబలి పోశారు.



పాల బిందెలతో ఆలయానికి వస్తున్న మహిళలు

# ఘనంగా హనుమాన్ జయంతి



పెనుమూరు: హనుమాన్ జయంతి



విశేష అలంకరణలో స్వామివారు



పెనుమూరు: భక్తులకు అన్నదానం



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని కోటార్లపల్లి, సింధురాజపురం గ్రామంలో వేలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింధురాజపురం గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పూలతో స్వామివారికి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త బాలాజీనాయుడు, రమేష్, హేమాద్రి, బుల్లెట్ బాబు, భాస్కర్‌నాయుడు, సుబ్రమణ్యం, మాధవ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా హనుమాన్ జయంతి**

పెనుమూరు(కార్వేటినగరం): హనుమాన్ జయంతి సందర్భంగా పెనుమూరు కోదండ రామస్వామి ఆలయం వద్ద వెలసిన హనుమాన్‌కు విగ్రహ వ్యవస్థాపకులు గుత్తా వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో 108 లీటర్ల పాలతో అభిషేకం చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకులు నటరాజ శర్మ, సురేంద్ర శర్మ, మహేంద్ర కుమార్ శర్మ వివిధ రకాల పుష్పాలతో హనుమాన్ విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం పెద్దఎత్తున భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, సామిరెడ్డిపల్లె సతీష్ రెడ్డి, గుంటిపల్లె బాబురెడ్డి, లంకిపల్లె ప్రకాష్, నరిగిపల్లె రమేష్, విశ్వప్రకాష్ నాయుడు, విశ్వహిందూ పరిషత్ బృందం పాల్గొన్నారు.

**కావూరివారిపల్లెలో..**

మండలంలోని కావూరివారిపల్లెలో వెలసిన హనుమాన్ విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి హనుమాన్‌ను దర్శించుకున్నారు. పెద్దఎత్తున భక్తులకు అన్నదానం జరిగింది.

నగరి: పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి కలశపూజ, మూర్తిహోమం, మహాపూర్ణాహుతి, తిరుమంజనం నిర్వహించి ఆర్చికి కుంభాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం, సుమంగళి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త ఆర్‌వి మహేష్, ఆలయ కమిటీ సభ్యులు ఆనం విజయలక్ష్మి, ఎల్‌కే రాము, ఎస్ఎస్ మురళి, ఎస్ఎస్ సుబ్రమణ్యం అన్నదానం చేశారు. సాయంత్రం మాడవీధుల్లో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఊరేగింపు నిర్వహించారు.





దేవేరులతో శ్రీవేణుగోపాలుడి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, భక్తులకు ప్రసాదాల పంపిణీ

# మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ



బహుమతులు అందుకున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఎంఈఓ, శిక్షకులు

నగరి: రాష్ట్రప్రభుత్వం ఆదేశానుసారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే కార్మికులకు శనివారం నగరి మండలంలో పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బి.నమశ్శివాయం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన వంటకాలు, మెనూ ప్రకారం వంటలు ఎలా చేయాలో పీఎం పోషణ్ కింద శిక్షణ ఇచ్చారు. అలాగే వంట చేసేవారికి వంటలు ప్రాముఖ్యత తెలిసేలా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి బహుమతిని జెడ్పీ హైస్కూల్ ఎం.కొత్తూరు వారు, రెండవ బహుమతిని బాలికల ఉన్నత పాఠశాల నగరి వారు, మూడవ బహుమతిని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నగరి వారు అందుకున్నారు. ఈ కార్యక్రమమునకు రిసోర్స్ పర్సన్‌గా సహీనా, కేవీ గణేశన్, జయశంకర్ వ్యవహరించారు. ట్రైనింగ్ ఆర్గనైజర్‌గా ఎంఈఓ బి.నమశ్శివాయం, ట్రైనింగ్ కోఆర్డినేటర్లుగా ఎం.విజయభాస్కర్, ఎం.శ్రీవాణి పాల్గొన్నారు.

## వైభవంగా అర్జున తపస్మాన్ వేడుకలు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం సమీపంలో నిర్వహిస్తున్న 18వ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారతం 17 ఏళ్ల తెలుగు నాటక వేషధారులు మహాభారత ఉత్సవాలను ఆడుతున్నారు. గతేడాది తమిళ భాషలో మహాభారత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అర్జున తపస్మాన్ వేడుకలను చూడడానికి మండల పరిధిలోని ప్రజలు, తమిళనాడు, కర్ణాటక ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమిళం నాటకంలో అర్జున వేషధారి అగ్రహారం (సుబ్బయ్య)చెట్టులోని ప్రతి మెట్టు మెట్టుకూ పరమశివున్ని వేడుకుంటూ, పద్యాలను ఆలపిస్తూ తపస్సు మానును అధిరోహించారు. సంతాన లేమితో బాధ పడుతున్న పలువురు మహిళలు తపస్సుమాను వద్ద పడుకుని వరపడి వేడుకున్నారు. అర్జునుడు తపస్సుమాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, విబూధి, పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఏడాది తమిళ నాటకం వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో శ్రీకృష్ణ, ద్రౌపదీ ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

# కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలుడు







దేవేరులతో శ్రీవేణుగోపాలుడి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, కల్యాణం హాజరైన దంపతులు, కార్వేటినగరం కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీవేణుగోపాలుడు

- కర్పూర హారతులు పట్టిన భక్తులు

కార్వేటినగరం: వేణుగోపాలుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన శనివారం ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాంగశ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరిస్తూ, భక్తులచే కర్పూర హారతులను అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**కల్యాణం..కమనీయం..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం వేణుగోపాలస్వామి ఆలయంలో ఉభయ నాంచారుల సమేత శ్రీవేణుగోపాలుడి కల్యాణం భక్తులకు కనువిందు చేసింది. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు గంట పాటు జరిగిన ఆర్జిత కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని తీర్థ ప్రసాదలతో పాటు వస్త్రబహుమానం అందుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితుల వేదమంత్రాల నడుమ ఉభయనాంచారుల శిరస్సులపై ముత్యాల తలంబ్రాలు పోసి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు పలు గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని అలంకరణ మండపంలో ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలున్ని పట్టువస్త్ర సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించడంతో స్వామివారు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరించారు. చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల మధ్య అత్యంత వైభవంగా ఊరేగారు. రాత్రి పదిగంటలకు వేదపండితులు ఏకాంత సేవలో స్వామివారిని పవళింపజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టాచార్యులు నారాయణ దాశరథి, తరుణ్‌కుమార్, అలంకార పండితులు, టీటీడీ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

**నేడు గరుడోత్సవం**

శ్రీవేణుగోపాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయిదో రోజు ఆదివారం గరుడాళ్వార్‌పై రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారు నగర వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నట్లు ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిసేవలో దర్శనం ఇస్తారని చెప్పారు.